
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



నల్లగొండ

5

శనివారం 6 జూలై 2024

గరిష్ఠం 34.0
కనిష్ఠం 24.6
***

ప్రాజెక్టుల నీటిమట్టం


ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	503.80 (121.3844)	నిల్	800
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	637.55 (2.68)	59.87	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	95.17 (0.43)	నిల్	50

చికెన్ ధరలు | లైవ్ : రూ.134 | డ్రెస్ : రూ.194 | స్కిన్‌లెస్ : రూ.224

ఇతర రాష్ట్రాలకు చెందిన నేరస్థులు ఉమ్మడి జిల్లాలో ప్రవేశించి హద్దులు దాటి నేరాలకు పాల్పడుతున్నారు. ప్రధానంగా బీహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, ఒడిషా, మహారాష్ట్ర, చత్తీస్‌ఘడ్ ప్రాంతాలకు చెందిన వారితో పాటు ఏపీకి చెందిన కొందరు నేరస్థులు జాతీయ రహదారులతోపాటు ఉమ్మడి జిల్లాలో పలు నేరాలకు పాల్పడుతున్నారు. జిల్లాలో హత్యలు జరుగుతున్నా, వాటిని ఎవరు చేశారో కూడా తెలియకుండా నిందితులు తప్పించుకొని తిరుగుతున్నారు. హత్యచేసి రహదారుల వెంట మృతదేహాలను పడేసి వెళ్తుండటంతో ఈ కేసులు ఛేదించడం పోలీసులకు సవాల్‌గా మారుతోంది. ఈనెల 4వ తేదీన చిట్యాల వద్ద నల్లగొండ సీసీఎస్ పోలీసులకు బీహార్‌కు చెందిన పార్ధీ గ్యాంగ్ తారసపడింది. జాతీయరహదారిపై పలు మార్లు జరుగుతున్న నేరాలను దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక బృందాలు పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి పార్ధీ గ్యాంగ్ చిట్యాల వద్ద పోలీసుల కంటపడింది. పోలీసులను చూసిన ఈ గ్యాంగ్ ఓ వాహనంలో హైదరాబాద్‌వైపు పరారైంది. సీసీఎస్ పోలీసులు ఆ వాహనాన్ని చేజ్‌చేసి చివరికి హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో వాహనాన్ని అటకాయించి పట్టుకునే ప్రయత్నం చేయడంతో నేరస్థులు కత్తులతో దాడికి యత్నించారు. ఈ క్రమంలో సీసీఎస్ పోలీసులు గాలిలోకి కాల్పులు జరిపారు. అనంతరం చాకచక్యంగా నలుగురు నిందితులను అదుపులోకి తీసుకొని నల్లగొండలో విచారిస్తున్నారు.

హైదరాబాద్-విజయవాడ రహదారిపై పార్ధీ గ్యాంగ్ కలకలం సృష్టించింది. నెల రోజులుగా ఈ గ్యాంగ్ జాతీయ రహదారిపై సంచరిస్తోందన్న వార్త ప్రయాణికుల్లో భయాందోళన రేకెత్తించింది. ఇటీవల ఈ గ్యాంగ్ ఆగడాలు పెరిగిపోయాయి. హైదరాబాద్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, తెలంగాణ రాష్ట్రంలోని పలు జిల్లాల ప్రజలను ఈ గ్యాంగ్ గడగడలాడిస్తూ దోపిడీలకు పాల్పడుతోంది. దీంతో నూతనంగా బాధ్యత లు స్వీకరించిన నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్రపవార్ ఆధ్వర్యంలో మహారాష్ట్రకు చెందిన ఈ గ్యాంగ్‌ను పట్టుకునేందుకు స్పెషల్ ఆపరేషన్ టీం రంగంలోకి దింపి ఆటకట్టించారు.

- నల్లగొండ





పార్ధీ గ్యాంగ్ కలకలం

- జాతీయ రహదారిపై పెరుగుతున్న నేరాలు, ఘోరాలు
- చిట్యాల వద్ద సీసీఎస్ పోలీసులకు తారసపడ్డ నేరస్థులు
- పోలీసులపై దాడికి యత్నం
- పెద్దఅంబర్‌పేట వద్ద గాలిలోకి కాల్పులు
- అదుపులో నలుగురు నిందితులు

గతంలో జరిగిన సంఘటనలతో భయం.. భయం.

- మే 18వ తేదీన ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లా పామర్రు మండలం చట్టవారిపురం గ్రామానికి చెందిన రాజవర్ధన్‌ను కట్టంగూరు మండలం ఎర్రసాని గూడెం వద్ద కొందరు వ్యక్తులు కాళ్లకు తాళ్లు కట్టి హత్య చేసి పరారయ్యారు.
- జూన్ నెలాఖరులో నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్ర వాహనంపై నల్లగొండకు వస్తున్న సమయంలో నార్కట్‌పల్లి వద్ద ఇద్దరు దుండగులు ఆ వ్యక్తి వాహనాన్ని ఆపి చితకబాదడంతో పాటు సుమారు రూ.2500లను ఎత్తుకెళ్లారు.
- రెండు నెలల క్రితం హైదరాబాద్ నుంచి మిర్యాలగూడకు ఆర్టీసీ బస్సులో వెళ్లుతున్న ఓమహిళను నార్కట్‌పల్లి బస్టాండ్ వద్ద గుర్తు తెలియని వ్యక్తులు పరిచయం చేసుకుని ఆమె వద్ద ఉన్న 8తులాల బంగారు గొలుసుతో పరారయ్యారు.
- ఆరు నెలల క్రితం నార్కట్‌పల్లి శివారులో ఉన్న హోటల్ వద్ద ఆగి ఉన్న బస్సులో ప్రయాణికుల నుంచి కిలో బంగారం ఎత్తుకెళ్లారు. ఈ సంఘటన జరిగిన దానికంటే కొద్ది రోజుల ముందు మరోవ్యక్తి నుంచి రూ.50లక్షలు ఎత్తుకెళ్లారు. అయితే ఈ సంఘటనలపై పోలీసులకు ఫిర్యాదులు కూడా వెళ్లాయి.
- జూన్ 9వ తేదీన చిట్యాల మండలం చిన్నకాపర్తి సమీపంలో ఏపీ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్లుతున్న ఓ కుటుంబ సభ్యులు విశ్రాంతి కోసం పార్కింగ్ చేసి నిద్రపోయారు. తెల్లవారుజామున కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వారిని చితకబాది 8తులాలకు పైగా బంగారాన్ని ఎత్తుకువెళ్లారు.
- యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మనాగారంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. గ్రామానికి చెందిన వరకాంతం బాలమ్మ (55) హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న కుమారుడి ఇంటికి వెళ్లింది. ఇంటికి సమీపంలో ఉన్న పడమటి మహేష్‌రెడ్డి శుక్రవారం ఉదయం ఇంటి ముందు నుండి వెళ్తుండగా తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే బాలమ్మ కుమారుడు సందీప్‌రెడ్డికి సమాచారం అందించారు. ఉదయం 9 గంటలకు బాలమ్మ ఇంటికి వెళ్లింది. ఇల్లు చూసేసరికి బీరువా విరగ్గొట్టి ఉంది. బీరువాలో ఉన్న తులం బంగారు అభరణం, రూ.20వేల నగదు అపహరణకు గురైనట్టు గుర్తించారు.

పెరుగుతున్న నేరాలతో ప్రజల్లో ఆందోళన



జాతీయ రహదారితో పాటు నార్కట్‌పల్లి-అద్దంకి రాష్ట్ర రహదారిపై పలు నేరాలు చోటు చేసుకుంటున్నాయి. డీజిల్ దొంగతనాలు, వ్యభిచారం, హిజ్రాల వేధింపులు, వాహనాలు పార్కింగ్ చేసి నిద్రిస్తున్న వారిపై దాడులతో పాటు నగదు, వస్తువులు ఎత్తుకెళ్లడం, డబ్బు కోసం దాడులు జరుగుతున్నాయి. నేరస్థులు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి రైళ్లు, ప్రైవేట్ వాహనాలు, బస్సుల్లో పరారవుతున్నారు. జాతీయ రహదారిపై సీసీ కెమెరాలు పెద్దగా లేకపోవడం, ఉన్నా అవి పనిచేయకపోవడంతో నేరస్థులను పట్టుకోవడం కష్టతరంగా మారుతోంది. నేరాలు పెరుగుతుండటంతో రహదారులపై రాత్రి వేళ ప్రయాణం చేయాలంటే ప్రయాణికులు భయపడుతున్నారు.

నలుగురు అదుపులో ఉన్నారు..



జిల్లాలో జరుగుతున్న వరుస ఘటనల నేపథ్యంలో పార్ధీ గ్యాంగ్‌కు సంబంధించిన నలుగురు నిందితులు అదుపులో ఉన్నారు. ఈ కేసును చాలెంజ్‌గా తీసుకుని పూర్తి విచారణ చేస్తున్నాం. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు త్వరలో వెల్లడిస్తాం.

- శరత్‌చంద్రపవార్, నల్లగొండ జిల్లా ఎస్పీ

దోపిడీ చేసేందుకు వచ్చి పోలీసులకు చిక్కి

నల్లగొండ జిల్లా చిట్యాల పరిసరాల్లో దోపిడీ చేసేందుకు వచ్చిన పార్ధీ గ్యాంగ్ ముఠా పోలీసులను చూసి పరారైంది. ఈ క్రమంలో వాహనంలో పారిపోతుండటంతో పోలీసులు ఆ వాహనాన్ని ఛేజింగ్ చేశారు. చివరకు హైదరబాద్ సమీపంలోని ఔటర్ రింగ్ రోడ్డు వద్ద పార్ధీ గ్యాంగ్ వెళ్తున్న వాహనాన్ని పోలీసులు అటకాయించారు. దీంతో వాహనాన్ని నిలిపిన నిందితులు పరారయ్యే ప్రయత్నం చేయడంతో పాటు పోలీసులపై కత్తుల దాడికి పాల్పడినట్లు తెలిసింది. ఈ క్రమంలో పోలీసులు ఆత్మరక్షణ కోసం గాలిలోకి కాల్పులు జరపడంతో పాటు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకోగా ఆరుగురు నిందితులు పరారైనట్లు తెలిసింది. ఈ నలుగురిని నల్లగొండ పోలీసులు విచారిస్తున్నారు. పెద్ద అంబర్‌పేట ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలో గురువారం అర్ధరాత్రి దోపిడీ చేసేందుకు వచ్చి పోలీసులకు పట్టుబడిన మహారాష్ట్రకు చెందిన పార్ధీ గ్యాంగ్‌పై జిల్లాలో తీవ్ర చర్చ సాగుతోంది. ఈ గ్యాంగ్ పెట్రోల్ బంకు, ఇళ్లు, బ్యాంకులు దోచుకోవడంలో ఆరి తేరారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ గ్యాంగ్‌పై పదుల సంఖ్యలో కేసులు నమోదైనట్లు సమాచారం. మోస్ట్ వాటెండ్ గ్యాంగ్‌గా పార్ధీ గ్యాంగ్ పోలీసుల హిట్ లిస్టులో ఉన్నట్లు తెలిసింది.





చౌటుప్పల్ రూరల్: రంగారెడ్డి జిల్లా పెద్ద అంబర్‌పేట పోలీసు కాల్పుల్లో పట్టుబడ్డ దొంగలు గురువారం రాత్రి దేవలమ్మనాగారంలో వరకాంతం బాలమ్మ ఇంటి తలుపులు విరగ్గొట్టి బీరువాలో ఉన్న తులం బంగారం, రూ.20వేల నగదు అపహరించారు. ఈ దొంగతనం చేసింది పార్ధీ గ్యాంగ్‌గా పోలీసులు భావిస్తున్నారు. ఇక్కడ దొంగతం చేసి పరారై రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం హైవేలో టాటా ఏసీ ఆటో ఎక్కినట్లు భావిస్తున్నారు. టాటా ఏసీ ఆటో ఎక్కి హైదరాబాద్ వైపు వెళ్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. పట్టుబడ్డ దొంగలను నల్లగొండ పోలీసులు విచారించగా దేవలమ్మనాగారంలో దొంగతనం చేసినట్టు అంగీకరించనట్టుగా తెలుస్తోంది. పార్ధీ గ్యాంగ్ పట్టుబడిన ఆటో చౌటుప్పల్ మండలం ఎల్లగిరికి చెందిన మారగోని జంగయ్యకు చెందింది. చౌటుప్పల్ నుంచి ఎల్‌బీనగర్‌కు ప్యాసింజర్‌తో జంగయ్య టాటా ఏసీ ఆటోవెళ్తుండగా రంగారెడ్డి జిల్లా కొత్తగూడెం వద్ద పార్దు గ్యాంగ్ ఇద్దరు దొంగలు ఎక్కారు. పెద్ద అంబర్‌పేట వద్ద వీరు పోలీసులకు పట్టుబడ్డారు.

పార్ధీ గ్యాంగ్ పనేనా?





ఆటోలో పార్ధీ గ్యాంగ్ అనుమానితులను పట్టుకున్న పోలీసులు

పక్కా స్కెచ్‌తో పట్టేశారు

(ఆంధ్రజ్యోతి, అబ్దుల్లాపూర్‌మెట్): పార్ధీ గ్యాంగ్‌ను పోలీసులు పక్కా వ్యూహంతో అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో దొంగలు ఎదురుదాడికి యత్నించడంతో పోలీసులు గాల్లోకి ఒక రౌండ్ కాల్పులు జరిపారు. ఆ వెంటనే నలుగురిని అదుపులోకి తీసుకున్న నల్లగొండ సీసీఎస్ పోలీసులు, వారిని నల్లగొండకు తరలించారు. పార్ధీ గ్యాంగ్ హైదరాబాద్ శివారులో ఉన్నట్లు తెలుసుకున్న నల్లగొండ సీసీఎస్ పోలీసులు అబ్దుల్లాపూర్‌మెట్‌తో పాటు హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్లకు సమాచారం ఇచ్చారు. దీంతో గురువారం రాత్రి ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో వాహన తనిఖీలతో పాటు పెట్రోలింగ్, హోటల్, లాడ్జీల్లో తనిఖీలను చేసినట్లు సమాచారం. పార్ధీ గ్యాంగ్ దొంగలు నగర శివారు కొత్తగూడెంలో ఉన్నట్లు పక్కా సమాచారం అందుకున్న సీసీఎస్ పోలీసులు వారిని పట్టుకునేందుకు అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ పోలీసుల సహకారం కోరారు. గ్యాంగ్‌లోని ఇద్దరు దొంగలు బాటసింగారం కొత్తగూడెం వద్ద శుక్రవారం ఉదయం 8.45గంటలకు చౌటుప్పల్ నుంచి నగరానికి వస్తున్న టాటా ఏస్ ఆటోలో ఎల్‌బీనగర్‌కు వెళ్లాలని ఎక్కారు. అప్పటికే అక్కడ నల్లగొండ సీసీఎస్‌కు చెందిన ఇద్దరు కానిస్టేబుళ్లు వారిని గమనిస్తున్నారు. అక్కడి నుంచి వారు ఓ కారులో ఆటోను వెంబడిస్తూ వస్తున్నారు. ఆటో రామోజీఫిల్మ్ సిటీ ప్రధాన గేటు దాటగానే, జాతీయ రహదారిపై నగరం వైపునకు వెళ్లే ఇతర వాహనాలను పోలీసులు కొద్దిసేపు నిలిపివేశారు.

9 గంటలకు ఆటో పెద్దఅంబర్‌పేట్ ఓఆర్ఆర్ సమీపం వద్దకు చేరుకుంది. సంపూర్ణ హోటల్ ఎదురుగా జాతీయ రహదారిపై ఆటోలో ఉన్న మహిళ దిగుతాననడంతో డ్రైవర్ ఆటోను స్లో చేశాడు. ఆ వెంటనే కారులో ఉన్న ఇద్దరు సీసీఎస్ పోలీసులు దిగి ఆటో ముందు, వెనుక సీట్లో కూర్చున్న ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. దీంతో వారు తప్పించుకునే ప్రయత్నం చేస్తుండడంతో, ఓ కానిస్టేబుల్ తన వద్ద ఉన్న పిస్టల్‌తో ఒక రౌండ్ గాల్లోకి కాల్పులు జరిపారు. వెంటనే ఇద్దరిని పట్టుకుని చేతులకు బేడీలను వేశారు. కాగా, ఒక్కసారిగా కాల్పులు జరపడంతో ఆటోలో ఉన్న ప్రయాణికులు సైతం భయాందోళనకు గురయ్యారు. అప్పటికే అక్కడ కాపుకాసి ఉన్న అబ్దుల్లాపూర్‌మెట్, హయత్‌నగర్ పోలీసులు రౌండప్ చేశారు. అయితే గ్యాంగ్ వద్ద కత్తెరలు ఉన్నట్లు సమాచారం.

అధికారులు, ప్రజాప్రతినిధులు కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు

జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి



జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న అధికారులు

నల్లగొండ, జూలై 5: అధికారులు, ప్రజాప్రతినిధులు కష్టపడి పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అన్నారు. జడ్పీ చైర్మన్‌గా ఐదేళ్ల బాధ్యతలు నిర్వహించిన ఆయన పదవీకాలం ముగియడంతో శుక్రవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో ఉద్యోగులు, అధికారులు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉద్యోగులు, అధికారులు సమయపాలన పాటించి బాధ్యతతో పనిచేయాలని సూచించారు. తాను చైర్మన్‌గా ఉన్న రోజులు ప్రతీ సమావేశానికి ముందుగానే వచ్చేవాడినని గుర్తుచేశారు. ఐదేళ్లు తనకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాపరిషత్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చిన నిధులతో మారుమూల ప్రాంతాల అభివృద్ధికి శాయశక్తుల ప్రయత్నించామన్నారు. తమ హయంలో 100మందికి కారుణ్య నియామకాలు చేశామని, 250మందికి పదోన్నతులు కల్పించామన్నారు. అనంతరం ఆయన్ను జడ్పీ అధికారులు, ఉద్యోగులు పూలమాలలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎస్. ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల రాష్ట్ర అధ్యక్షుడు ఏపాల సత్యనారాయణరెడ్డి, జిల్లా అధ్యక్షుడు కొప్పు రాంబాబు, కె.నరేందర్‌రెడ్డి, తిరుపతయ్య, వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, ముజీబుద్దీన్, నాగయ్య, యాకుబ్‌నాయక్, గోనారెడ్డి, గోలి అమరేందర్‌రెడ్డి, జి.వెంకటేశ్వర్లు, పున్న గణేష్, ఆలకుంట్ల మోహన్‌బాబు, జమాల్‌ఖాద్రీ, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకాధికారిగా బాధ్యతలు తీసుకున్న కలెక్టర్

జిల్లా పరిషత్ ప్రత్యేకాధికారిగా కలెక్టర్ సి.నారాయణరెడ్డి శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. జడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి పదవీకాలం ఈనెల 4వ తేదీతో ముగిసిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్‌కు కలెక్టర్‌ను ప్రత్యేకాధికారిగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్‌ను అధికారులు, సిబ్బంది శాలువాలు, పూలమాలతో సత్కరించి స్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి, డిప్యూటీ సీఈవో శ్రీనివాసరావు, మిషన్ భగరీథ ఎస్ఈ వెంకటేశ్వర్లు, పంచాయతీరాజ్ ఈఈ భూమన్న, లాండ్ సర్వే ఏడీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక పరిస్థితులతో పోటీ చేయలేకపోయా

- ఎంపీ, ఎమ్మెల్యేగా అవకాశమిచ్చినా వద్దనుకున్నా
- బీఆర్ఎస్ పార్టీని వీడేది లేదు
- వీడ్కోలు సమావేశంలో బండా నరేందర్‌రెడ్డి



వీడ్కోలు సమావేశంలో మాట్లాడుతున్న నరేందర్‌రెడ్డి

తనకున్న ఆర్థిక పరిస్థితుల రీత్యా ఉన్నత పదవులకు పోటీ చేసేందుకు వెనకడుగు వేశానని జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి అన్నారు. జడ్పీ చైర్మన్ పదవీ కాలం ముగిసిన సందర్భంగా శుక్రవారం నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ మలిదశ ఉద్యమ నాయకుడిగా, తనకు ఎంతో రాజకీయ భవిష్యత్తును కల్పించిన బీఆర్ఎస్ పార్టీని ఎట్టి పరిస్థితుల్లో వీడే ప్రసక్తి లేదన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, తనను ఎమ్మెల్యే, ఎంపీ, ఎమ్మెల్సీగా పోటీ చేయాలని సూచించినా, తానే తన ఆర్థిక పరిస్థితిని అంచనా వేసుకుని వెనకడుగు వేశానన్నారు. ఒకవేళ ఓడిపోయినా తిరిగి సమాజంలో నిలబడే శక్తి ఉన్నప్పుడే పోటీ చేయాలన్న భావన ఉన్నందునే బరిలో నిలవలేదన్నారు. కేసీఆర్ తనపై నమ్మకంతో రెండుసార్లు రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, జిల్లా పరిషత్ చైర్మన్‌గా అవకాశం కల్పించారన్నారు. ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించిన కేసీఆర్‌కు రుణపడి ఉంటానని తెలిపారు.

సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలి

కలెక్టర్ నారాయణరెడ్డి



ఆస్పత్రిలో అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి


నల్లగొండ టౌన్, జూలై 5: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి ప్రభుత్వ వైద్యులను కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రం సమీపంలోని పానగల్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని మందులు, అటెండెన్స్ రిజిస్టర్, వసతులు, ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ రిజిస్టర్లు, స్టాక్ రిజిస్టర్, వార్డులను పరిశీలించారు. ఆస్పత్రి ఎదుట ఉన్న ఓపెన్ డ్రైనేజీలో వర్షాకాలంలో నీరు చేరి ఇబ్బంది కలుగుతున్నదని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రిలో చెత్తాచెదారం లేకుండా చూసుకోవాలని సూచించారు. ఆస్పత్రికి వచ్చిన గర్భిణులతో మాట్లాడుతూ వైద్య సేవలు ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా మందులు వాడాలని, పౌష్టికాహారం తీసుకోవాలని సూచించారు. వైద్యులతో మాట్లాడుతూ, సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని, ప్రతీ గర్భిణి ఆస్పత్రి రికార్డుల్లో నమోదయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల్లో రెండు రోజులుగా ప్రత్యేక పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టామని, ఆస్పత్రి పరిసరాల్లో సైతం చెత్తాచెదారాన్ని తీసివేసి, పిచ్చి మొక్కలను తొలగించాలని ఆదేశించారు. ఆయన వెంట జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఇన్‌చార్జి అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, డిప్యూటీ డీఎంహెచ్‌వో వేణుగోపాల్‌రెడ్డి, ఆస్పత్రి వైద్యాధికారి రూపిక, కోఆర్డినేటర్ భిక్షం తదితరులు ఉన్నారు. అదేవిధంగా ట్రాన్స్‌జెండర్ స్వయం ఉపాధి శిక్షణ ముగించుకున్న 26 మందికి కలెక్టర్ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్వయం ఉపాధి నైపుణ్యాలను, శిక్షణ అవకాశాలను పెంపొందించడం కోసం హైదరాబాద్‌కు చెందిన నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ హాస్పటల్ మేనేజ్‌మెంట్ సహకారంతో ప్రభుత్వం సుమారు రూ.10లక్షలు వెచ్చించి శిక్షణ ఇప్పించిందన్నారు. సమాజంలో లింగ వివక్షను పోగొట్టడం, వీరికి సమాన అవకాశాలు కల్పించడం కోసం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ శాఖల సమన్వయంతో ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి సక్కుబాయి, అదనపు అధికారి వేణు, మునగాల నాగిరెడ్డి, ట్రాన్స్‌జెండర్ నందిని, తనుశ్రీ, సితార, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల వ్యయ పరిశీలకుడికి వీడ్కోలు

పార్లమెంటు ఎన్నికల్లో భాగంగా కేంద్ర ఎన్నికల సంఘం వ్యయ పరిశీలకుడికి నియమించిన, 2016ఐఆర్ఎస్ బ్యాచ్ అధికారి కళ్యాణ్‌కుమార్‌దాస్‌కు జిల్లా యంత్రాంగం శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికింది. పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థుల తుది లెక్కల నిర్ధారణ, నివేదికల సమర్పణ నిమిత్తం గతనెల 27న ఆయన జిల్లాకు వచ్చారు. గురువారం అభ్యర్థుల తుది లెక్కలను నిర్ధారించి కేంద్ర ఎన్నికల సంఘానికి సమర్పించారు. అనంతరం శుక్రవారం ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆయనకు వీడ్కోలు పలికారు. శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో కలెక్టర్ కార్యాలయ ఏవో మోతిలాల్, ఎన్నికల విభాగం డీటీ విజయ్, ఎన్నికల సహాయ అధికారి సురేష్ పాల్గొన్నారు.

రవాణాశాఖలో ఆన్‌లైన్ సేవలు

- ప్రత్యేకంగా 'టీ-యాప్ ఫోలియో'
- 17 రకాల సేవలు అందుబాటులో
- మొబైల్ ద్వారానే అన్నీ సేవలు



వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలనే ప్రభుత్వ సంకల్పాని అనుగుణంగా రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలను విస్తృత పరుస్తోంది. దీంతో సమయం ఆదా కావడంతో పాటు, డబ్బు దుర్వినియోగం కాకుండా ప్రజలకు ఈ సేవలు ఉపయోగపడనున్నాయి. ఆన్‌లైన్‌లో స్లాట్ బుకింగ్‌తో పాటు రవాణాశాఖకు చెందిన మరో 17 రకాల సేవలు 'టీ-యాప్ ఫోలియో'లో అందుబాటులోకి వచ్చాయి. వినియోగదారులు రవాణా కార్యాలయానికి రాకుండానే ఈ సేవలను ప్రత్యేకంగా రూపొందించిన ఈ యాప్ ద్వారా పొందాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

•7లో..

దివ్యాంగులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి

వీహెచ్‌పీఎస్ రాష్ట్ర కోర్ కమిటీ వైస్ చైర్మన్ రాంబాబు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న దివ్యాంగులు

నల్లగొండ టౌన్, జూలై 5: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇచ్చిన దివ్యాంగుల పింఛన్ల పెంపు హామీని నిలబెట్టుకోవాలని దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందే రాంబా బు, ఎంఎస్పీ జిల్లా అధ్యక్షుడు బకరం శ్రీనివాస్‌మాదిగ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దివ్యాంగులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గత ఏడాది డిసెంబరు నుంచి పింఛన్లు రెట్టింపు చేస్తామని హామీ ఇవ్వడంతో పాటు ఎన్నికల మేనిఫెస్టోలో చేర్పిందన్నారు. ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. పెన్షన్ రూ.4వేల నుంచి రూ.6వేలకు, వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ, చేనేత కార్మికులకు రూ.4వేల పెన్షన్ ప్రతీ నెల ఐదో తేదీలోగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దివ్యాంగులకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం సౌకర్యం కల్పించాలని, స్థానిక సంస్థలో ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలన్నారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలంమాదిగ, వీహెచ్‌పీఎస్ నాయకుడు శ్రీరామదాస్ వెంకటాచారి, కొమ్ము హరికుమార్, చైతన్య రెడ్డి, చిలుముల జలందర్, తరి ఏడుకొండలు, మాసారం వెంకన్న, చింత శివశంకర్, వీరబోయిన సైదులు యాదవ్, తగుల వెంకన్న, నక్క సైదులు, చిర్రబోయిన యాదయ్య పాల్గొన్నారు.

'గుట్ట'లో అసంపూర్తి పనులపై నజర్

- పెండింగ్ పనులపై సర్కారుకు నివేదిక
- నిధుల మంజూరు కోసం వినతి
- కొండ కింద యాదరుషితో పాటు ప్రహ్లాద మండపం నిర్మాణం
- గుట్టలో 'గిరి ప్రదక్షిణ' దారిలో సిమెంట్ ఫ్లేవర్స్ టైల్స్ ఏర్పాటు

యాదాద్రి, జూలై 5(ఆంధ్రజ్యోతి): మహిమాన్విత స్వయంభూ యాదగిరిగుట్టపై లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో అసంపూర్తిగా ఉన్న పనులపై ఆలయ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఇప్పటికే కొండపై భక్తుల పాత ఆచారాలను పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా పలు పనులు ప్రతిపాదనల స్థాయిలో, మరికొన్ని అసంపూర్తిగా ఉన్నాయి. ఈ పనులు పూర్తి చేసేందుకు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రితో పాటు కమిషనర్ దృష్టికి ఆలయ అధికారులు తీసుకెళ్లారు. ఈ మేరకు యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలతో పాటు అభివృద్ధి పనులపై ఉన్నతాధికారులు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు పనులు నిధుల లేమితో పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి కొంతమేరకు నిధులు కేటాయించినట్టయితే పూర్తవుతాయని ఉన్నతాధికారులు దృష్టికి తెచ్చారు. కొండ కింద స్వామి అన్నదాన సత్రం, శిల్పారామం, సుందరీకరణ పనులు అసంపూర్ణంగా ఉన్నాయి. నిధులు మంజూరు కోసం ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం పరిశీలించి నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది.



గుట్టలో 'గిరి ప్రదక్షిణ' భక్తులకు సౌకర్యాల కల్పన

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామికి స్థానిక భక్తులు గిరిప్రదక్షిణ చేసుకుని, స్వామివారిని దర్శించుకోవడం ఆనవాయితీ. ఈ సంప్రదాయం ఏళ్లుగా కొనసాగుతోంది. స్వామివారి చెంత గిరి ప్రదక్షిణ ఉంటుందన్న అంశం ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి విచ్చేసే భక్తులకు అవగాహన లేదు. దేశంలోని ప్రముఖ ఆలయాలైన తమిళనాడులోని అరుణాచలం, ఆంధ్రప్రదేశ్‌లోని సింహచలంలో మాత్రమే గిరి ప్రదక్షిణ ఉంది. అయితే యాదగిరిగుట్టలోని స్వయంభూ స్వామివారికి ఇప్పటి వరకు స్థానిక భక్తులే గిరి ప్రదక్షిణ చేస్తున్నారు. అరుణాచలం, సింహాచలం తరహాలోనే ఆనాటి నుంచి సంప్రదాయంగా ఉన్నటువంటి గిరి ప్రదక్షిణను స్థానిక భక్తులతో పాటు ఆలయానికి విచ్చేసే వారంతా కూడా పాల్గొనేలా చర్యలు తీసుకున్నారు. జూన్ 18న స్వాతి నక్షత్రం పురస్కరించుకుని స్వామివారి గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు. ఈ ప్రదక్షిణకు విశేష ఆదరణ లభించింది. ఈనేపథ్యంలో భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు చేపడుతున్నారు. గుట్ట చుట్టూ 2.5కిలోమీటర్ల మేరకు వసతులు కల్పిస్తున్నారు. భక్తుల కోసం గిరిప్రదక్షిణ దారిలో సిమెంట్ ఫ్లేవర్స్ టైల్స్ ఏర్పాటుచేశారు. రోడ్డుకు ఇరువైపు ఫ్లెక్సీలు, సైన్‌బోర్డులు ఏర్పాటు చేశారు. మంచినీరు, మరుగుదొడ్లు, గుట్ట చుట్టూ లైటింగ్, వంటి వసతులు కల్పించారు. సంప్రదాయ దుస్తులు ధరించి, స్వామివారిని స్మరించుకుంటూ ప్రదక్షిణ చేపట్టేందుకు చర్యలుతీసుకుంటున్నారు.

కొండపైన ప్లాస్టిక్ నిషేధం..

రాష్ట్రంలోనే ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ప్లాస్టిక్ వాడకంతో పర్యావరణం దెబ్బతింటోంది. కొండపైన కింద ఎక్కడ చూసినా ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు దర్శనం ఇస్తున్నాయి. దీంతో ఆలయ పరిసర ప్రాంతంలో పర్యావరణం దెబ్బతింటోంది. దీంతో కొండపైన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లాస్టిక్ సంచులు, బ్యాగులు, సీసాలు నిషేధించాలని కోరుతూ అవగాహన ర్యాలీని నిర్వహించారు. జూన్ 15నుంచి కొండపైకి ప్లాస్టిక్ బ్యాగులను అనుమతించడంలేదు. ఆలయంలోకి విచ్చేసేభక్తులు డ్రెస్‌కోడ్ పాటించేలా చర్యలు తీసుకుంటున్నారు. సంప్రదాయ దుస్తులు ఉంటేనే అనుమతించేందుకుగానూ భక్తులకు అవగాహన కల్పిస్తున్నారు.ఈ మేరకు ఆలయ ప్రాంగణంలో ఫ్లెక్సీలను కూడా ఏర్పాటుచేశారు. పురుషులు దోతీ, తెల్లటి లుంగీ, షర్ట్, మహిళలు చీర, చుడీదార్ వంటి సంప్రదాయ దుస్తులు ధరించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. త్వరలోనే సంప్రదాయ దుస్తులు ఉంటేనే స్వామి దర్శనానికి అనుమతించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

సౌకర్యాలను మెరుగుపరుస్తున్నాం



యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామివారిని దర్శించుకునేందుకు విచ్చేసే భక్తులకు మౌలిక సౌకర్యాలను మెరుగుపరుస్తున్నాం. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తిచేసేందుకు దేవాదాయ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లాం. గిరి ప్రదక్షిణ చేపట్టే భక్తులకు వసతులు కల్పించాం. స్వామివారి దర్శనానికివిచ్చేసే భక్తులు సంప్రదాయ దుస్తులు ధరించాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నాం. పర్యావరణ పరిరక్షణలో భాగంగా కొండపైన ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేస్తున్నాం. వసతులతో పాటు ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. హైదరాబాద్ నగరంతో పాలు పలు ప్రాంతాల్లో ఉన్నటువంటి సంగీత కళాశాల విద్యార్థులు, ప్రముఖ విద్వాంసుల చేత స్వామివారి దర్శనానంతరం భక్తులకు భక్తి భావం పెంపొందించేందుకు ప్రతి శుక్ర, శనివారాల్లో సాయంకాలం 5గంటల నుంచి 7గంటల వరకు సంగీత సాహిత్య నృత్య సభలు ఏర్పాటు చేస్తున్నాం.

- ఆలయ ఈవో ఎ.భాస్కర్‌రావు

యాదరుషితో పాటు ప్రహ్లాద మండపం నిర్మాణం

రుష్యశృంగ మహర్షి, శాంతల పుత్రుడు శ్రీయాద మహర్షి, శ్రీఆంజనేయస్వామి ఆశీస్సులతో ఈ గిరిపై నృసింహస్వామి గురించి మహా తపస్సు చేశాడని ప్రతీతి. ఆ తపస్సుకు మెచ్చి అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, సృష్టి స్థితి, లయకారుడు, ఆశ్రిత వత్సలుడు అయిన శ్రీలక్ష్మీ నరసింహస్వామి పంచరూపాల్లో ప్రత్యక్షమయ్యారని, జ్వాలా నరసింహస్వామి, యోగానంద, గండభేరుండ, ఉగ్ర, శ్రీలక్ష్మీనరసింహస్వామిగా ఆవిర్భవించి ఎన్నో మహిమలను చూపుతున్నారని భక్తుల నమ్మకం. యాదరుషి పేరుతో వెలసిన దివ్య పుణ్యక్షేత్రమే ఈ యాదగిరిగుట్ట. ఆ రుషి పేరు మీద యాదగిరిగా ప్రసిద్ధికెక్కింది. ఈ నేపథ్యంలో యాదరుషి విగ్రహం కొండ కింద తులసి కాటేజీ వద్ద మర్రి చెట్టు వద్ద ఏర్పాటుచేశారు. రోడ్డు డివైడర్‌కు పక్కనే ఉండటంతో యాదరుషిని భక్తులు దర్శించుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో సుప్రసిద్ధ మహర్షి యాదరుషికి ఆధునిక ఆధ్యాత్మికంగా ప్రత్యేకంగా మండపాన్ని ఏర్పాటుచేయాలని దేవస్థానం అధికారులు కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. క్షేత్రం వెలిసేందుకు కారకుడైన యాదరుషికి ప్రత్యేకంగా మండపాన్ని నిర్మించాలని ఆలయ అధికారులు సంకల్పించారు. స్వామి భక్తుడైన భక్త ప్రహ్లాదుడికి కూడా మండపం నిర్మాణానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. భక్త లు యాదగిరిగుట్ట నుంచి కొండపైకి విచ్చేసే మార్గం లో యాదరుషితో పాటు ప్రహ్లాద మండపాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ మండపాలను నిర్మించేందుకు ఒక్కో మండపానికి దాదాపుగా రూ. 5నుంచి రూ.6లక్షల వరకు వెచ్చించనున్నారు.



యాదరుషి, ప్రహ్లాద మండపాల నిర్మాణంపై పరిశీలిస్తున్న ఆలయ ఈవో భాస్కర్‌రావు, ఇంజినీరింగ్ అధికారులు

స్వామి సేవలో మాధవానంద సరస్వతి

భువనగిరి అర్బన్, జూలై 5: గుట్ట లక్ష్మీనరసింహస్వామి దివ్యక్షేత్రాన్ని శుక్రవారం తొగుట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి సందర్శించారు. ఈసందర్భంగా ఆలయ ప్రధానార్చకుల ఆధ్వర్యంలో పూర్ణకుంభ స్వాగతం పలికారు. గర్భాలయంలోని స్వయంభువులను దర్శించుకున్న అనంతరం ఆలయ ఉపమండపంలో ప్రవచించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి దంపతులు చిరుసత్కారం చేశారు. కార్యక్రమంలో ఆలయ డీఈవో భాస్కరశర్మ, అర్చకులు, అదికారులు పాల్గొన్నారు.

వైభవంగా ఆండాళ్ అమ్మవారి ఊంజల్ సేవ

స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా జరిపారు. హరిహరులకు నిత్యపూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన అండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 17,25,786ఆదాయం సమకూరింది.



ఆలయంలో ప్రవచనాలు చేస్తున్న మాధవానంద సరస్వతి స్వామిజీ

ప్రజాపాలనకే పెద్ద పీట

» నాలుగు మునిసిపాలిటీల్లో 475 ఫిర్యాదులు » అర్జీలన్నీ పరిష్కరిస్తామంటున్న అధికారులు



మిర్యాలగూడ	398
చిట్యాల	37
దేవరకొండ	32
చండూరు	8

ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న మునిసిపల్ అధికారులు

మిర్యాలగూడ టౌన్, జూలై 5: సమస్యల సత్వర పరిష్కారం కోసం చేపట్టిన ప్రజావాణి కార్యక్రమానికి స్పందన లభిస్తోంది. ఇక నుంచి మునిసిపాలిటీల్లో ప్రతీ గురువారం ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఇటీవల పట్టణంలోని 48 వార్డులలో ప్రజావాణి కార్యక్రాన్ని చేపట్టగా 398 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అందులో ప్రజాపాలన కింద 128 దరఖాస్తులు ఉండగా శాశ్వత పథకాలైన పింఛన్ల కోసం 74, రేషన్ కార్డుల కోసం 56, ఇందిరమ్మ ఇళ్లకు 5 దరఖాస్తులు వచ్చాయి. ఇక వార్డుల్లో నెలకొన్న సమస్యలపై వచ్చిన దరఖాస్తులు నామమాత్రంగానే ఉన్నాయి. అంతర్గత రహదారులు, సీసీ రోడ్లు ఏర్పాటు చేయాలని 51, పారిశుధ్య సమస్యల పరిష్కారానికి 47 ఫిర్యాదులు అందినట్లు మునిసిపల్ అధికారులు తెలిపారు. తాగునీటి సమస్యలపై 15, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని 16 దరఖాస్తులు రాగా, మరో ఆరు దరఖాస్తులు అసంపూర్తిగా ఉన్నట్లు వార్డు ఆఫీసర్లు తెలిపారు. వచ్చిన అర్జీలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.



సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించరూ...

చిట్యాల: చిట్యాల మునిసిపాలిటీలో ఈ నెల 4వ తేదీన 12వార్డుల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 37 దరఖాస్తులు వచ్చాయి. సీసీ రోడ్ల డ్రైనేజీ నిర్మాణాలు గురించి 11, కుక్కలు, పందులు, దోమలు, కోతుల బెడద గురించి 3, వీధీదీపాల సమస్యపై 5, బోర్ మోటార్ మరమ్మతుల గురించి 2, మిషన్ భగీరథ కనెక్షన్స్ గురించి 5, పింఛన్ల కోసం 1, డ్రైనేజీ క్లీనింగ్ 1, గడ్డి తీయించడం 1, విద్యుత్ సమస్యలపై 2 మరికొన్ని చిన్నచిన్న సమస్యలపై దరఖాస్తులు వచ్చినట్లు మునిసిపల్ కమిషనర్ వీరేందర్ తెలిపారు.

నీటి లీకేజీని అరికట్టాలి

చండూరు: చండూరు మునిసిపాలిటీలోని 10 వార్డుల్లో శానిటేషన్, వాటర్ లీకేజీ సమస్యలను పరిష్కరించాలని ప్రజావాణికి 8 ఫిర్యాదులు వచ్చినట్లు మునిసిపల్ కమిషనర్ డాక్టర్ వెంకటమణికరణ్ తెలిపారు. చండూరు మండల వైద్యాధికారి డాక్టర్ మాస రాజుతో కలిసి మునిసిపాలిటీలో ఉన్న 10 వార్డుల్లో శానిటేషన్ తో పాటు వాటర్ లీకేజీలను పరిశీలించారు. లీకేజీ అయిన పైపులను మార్చి వాటి స్థానంలో కొత్త పైపులను అమర్చి సమస్య పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలం సీజన్ కావడంతో ఇంటి పరిసరాల్లో నీటిని నిల్వ ఉంచడం వల్ల దోమలు చేరి డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని మండల వైద్యాధికారి డాక్టర్ మాస రాజు కాలనీవాసులకు సూచించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని ఆయన సూచించారు.

కంపచెట్లు తొలగించరూ...

దేవరకొండ: మునిసిపాలిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రతి సోమవారం మునిసిపాలిటీలో ప్రజావాణి ద్వారా ఫిర్యాదులు, ప్రతీ గురువారం ప్రజావాణి బృందం వార్డుల్లో పర్యటించి సమస్యలు తెలుసుకొని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో దేవరకొండ మునిసిపాలిటీలోని 20 వార్డుల్లో వార్డు అధికారి, ఏఎన్ఎం, ఆశావర్కర్, అంగన్‌వాడీ టీచర్, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ అధికారుల బృందం పర్యటించి పారిశుధ్యం, నీటి సరఫరాపై కాలనీల్లో సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కాగా మిషన్‌భగీరథ నీరు సక్రమంగా కాలనీలకు అందడం లేదని నీరు లీకేజీ అవుతుందని 12 ఫిర్యాదులు వచ్చాయి. డ్రైనేజీలు శుభ్రంచేయాలని, నూతన డ్రైనేజీల నిర్మాణం చేపట్టాలని, కంపచెట్లు తొలగించాలని 25 ఫిర్యాదులు వచ్చాయి. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను మూడు రోజుల్లోగా పరిష్కరిస్తామని మునిసిపల్ అధికారులు చెబుతున్నారు. ప్రజావాణి నిర్వహించడం అభినందనీయమని, సమస్యలను పరిష్కరించాలని పట్టణవాసులు కోరుతున్నారు.



సత్వర పరిష్కారానికి చర్యలు



ప్రజావాణిలో శాశ్వత పథకాలతో పాటు వార్డుల్లో నెలకొన్న సమస్యల పరిష్కరించాలని ప్రజల నుంచి అర్జీలు అందాయి. వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు చేపడతాం. కౌన్సిల్ ఆమోదంతో ముడిపడి ఉన్న అంశాలు మినహా ఇతర సమస్యలను వెనువెంటనే పరిష్కరిస్తాం. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా, దోమలు వ్యాప్తించకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. వైద్యారోగ్య శాఖ సహకారంతో 'పరిశుభ్రత - ఆరోగ్యం' అంశంపై ప్రతీ వార్డులో అవగాహన కల్పిస్తున్నాం.

- యూసుఫ్, మునిసిపల్ కమిషనర్, మిర్యాలగూడ.

సమస్యలపై సమీక్షిస్తున్నాం



ప్రజావాణిలో వచ్చిన సమస్యలపై సమీక్షిస్తున్నాం. డ్రైనేజీ క్లీనింగ్, గడ్డి తొలగించడం వంటి సమస్యలను వెంటనే పరిష్కరించామని, వీధి దీపాల సమస్యను రెండు రోజుల్లో పరిష్కరిస్తాం.

- వీరేందర్, చిట్యాల మునిసిపల్ కమిషనర్

సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావాణి



దేవరకొండ పట్టణంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే ప్రజావాణి కార్యక్రమాన్ని చేపడుతున్నాం. 20 వార్డుల్లో నిర్వహించిన ప్రజావాణిలో 32 ఫిర్యాదులు వచ్చాయి. నీటి సరఫరాలో అంతరాయం, నీటి సమస్య ఉందని 12 ఫిర్యాదులు రాగా డ్రైనేజీ, కంపచెట్లు పెరిగాయని, పారిశుధ్య సమస్యపై 20 ఫిర్యాదులు వచ్చాయి. మూడు రోజులలోగా సమస్యలను పరిష్కరిస్తాం. మేజర్ సమస్య అయితే సోమవారం ప్రజావాణిలో ఉన్నతాధికారులతో చర్చించి నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరిస్తాం.

- భాస్కర్‌రెడ్డి, దేవరకొండ మునిసిపల్ కమిషనర్

నిధులు కేటాయించి సమస్యలను పరిష్కరించాలి



ప్రజావాణి కార్యక్రమం చేపట్టడం శుభ పరిణామం. ప్రజల సమస్యలను పరిష్కరించాలి. పట్టణంలో డ్రైనేజీలు, రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కంపచెట్లు పెరిగాయి. అధికారులు నిధులు కేటాయించి సమస్యలను శాశ్వతంగా పరిష్కరించాలి.

- వెంకటేష్ యాదవ్, ముత్యాలమ్మ బజార్, దేవరకొండ

నిత్యపూజా కైంకర్యాలు



ఉదయం 3.30 గంటలకు ఆలయాన్ని తెరుస్తారు

సుప్రభాతసేవ: ఉదయం 3.30నుంచి4వరకు
ఆరాధన: 4-4.30 వరకు, **బాలభోగం:** 4.30-5.15వరకు
నిజాభిషేకం: 5.15 నుంచి 6.15 గంటల వరకు
సహస్రనామార్చనలు: 6.15నుంచి 7గంటల వరకు
రాజభోగం: 11.45నుంచి 12.30వరకు, మధ్యాహ్నం 3-4 వరకు ఆలయం మూసివేస్తారు.
తిరువారాధన: సాయంత్రం 7నుంచి7.45గంటల వరకు
సహస్రనామార్చన: రాత్రి 7.30నుంచి 8.15గంటల వరకు
ఆరగింపు: రాత్రి 9 గంటల నుంచి
శయనోత్సవ దర్శనం: 9.30- 9.45 ద్వార బంధనం
ఉచిత దర్శనం: ఉదయం 5 నుంచి 8 గంటల వరకు తిరిగి సాయంత్రం 5-7 రాత్రి 8.15-9 గంటల వరకు
వీఐపీ వేళలు: ఉదయం 9-10, సాయంత్రం 4-5వరకు..

భువనగిరి అర్బన్

చెర్వుగట్టు ఆలయ వేళలు



ఉదయం: 5.00 గంటలకు తెరుస్తారు
సుప్రభాతసేవ మరియు నాదస్వరం: ఉదయం 5.00 నుంచి 5.30 వరకు
నిజాభిషేకం: ఉదయం 5.30నుంచి 6.30గంటల వరకు
దర్శనాలు: ఉదయం 6.30గంటల నుంచి 12గంటల వరకు
నివేదన: మధ్యాహ్నం 12.00 గంటలకు మహానివేదన
దర్శనం: 12.10నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు
మూసివేత: మధ్యాహ్నం ఒంటి గంటకు మూసివేత
సాయంత్రం: 3గంటలకు తెరుచుకోనున్న ఆలయం
దర్శనాలు: సాయంత్రం 3గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు దర్శనాలు
ద్వార బంధనం: సాయంత్రం 7.30 గంటలకు ప్రదోశకాల పూజలు మహా ఫల నివేదన, హారతి అనంతరం ద్వార బంధనం



చెర్వుగట్టుపై ఘనంగా లక్షపుష్పార్చన వేడుక

ప్రత్యేక అమావాస్యతో భారీగా తరలివచ్చిన భక్తులు

చినుకులు రాలుతున్నా కొండపై నిద్రించిన భక్తులు

నార్కట్‌పల్లి, జూలై 5: నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని ప్రసిద్ధ శైవక్షేత్రం చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం రాత్రి లక్ష పుష్పార్చన ఉత్సవం వైభవంగా నిర్వహించారు. అమావాస్య తిథి కొన్నేళ్ల తర్వాత వచ్చిన ప్రత్యేక అమావాస్య కావడంతో స్వామి దర్శనం కోసం చెర్వుగట్టు క్షేత్రానికి భక్తులు పోటెత్తారు. హైదరాబాద్‌తో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. తొలుత ప్రధానాలయం నుంచి పార్వతీ పరమేశ్వరుల ఉత్సవమూర్తులను సన్నాయి వాయిద్యాలు, భక్తుల శివనామ స్మరణల మధ్య పల్లకి సేవతో మహా మంటపానికి చేర్చారు. అనంతరం ఆలయ ప్రధానార్చకుడు పోతులపాటి రామలింగేశ్వరశర్మ, సహార్చక స్వాములు, వేద పండితుల వేద మంత్రోచ్చారణల మధ్య లక్ష పుష్పార్చన ఉత్సవం ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. పుష్పార్చన అనంతరం స్వామివారి చెంత పూజలందుకున్న పుష్పాలను తీసుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. శివసత్తుల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఈవో సిరికొండ నవీన్, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు. నార్కట్‌పల్లి ఎస్‌ఐ అంతిరెడ్డి పర్యవేక్షణలో బందోబస్తు నిర్వహించారు. ట్రాఫిక్ జామ్ అయ్యే పరిస్థితుల దృష్ట్యా వాహనాలను గుట్టపైకి అనుమతించలేదు.

అన్నప్రసాద వితరణ: లక్ష పుష్పార్చన ఉత్సవంలో పాల్గొనేందుకు చెర్వుగట్టు క్షేత్రానికి విచ్చేసిన భక్తులకు ఎల్లారెడ్డిగూడెం ఆర్చి వద్ద ఉన్న శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య నిత్యాన్నదాన ట్రస్టు, వృద్ధాశ్రమం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో సత్రం చైర్మన్ రంగా శేఖర్, వైస్ చైర్మన్ మీలా సోమయ్య, ట్రస్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధ భరించలేక రైతు ఆత్మహత్య

నల్లగొండ జిల్లా చందంపేటలో ఘటన



మంగ్త(ఫైల్)

చందంపేట, జూలై 5: అప్పుల బాధ భరించలేక ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చందంపేట మండలం యాపలపాయ తండాలో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... తండాకు చెందిన రైతు మంగ్త (55) ఐదు ఎకరాల్లో పత్తి పంట సాగు చేస్తున్నాడు. వర్షాభావ పరిస్థితుల కారణంగా పెట్టుబడి వచ్చే పరిస్థితి లేకపోవడం, ముగ్గురు కుమార్తెల వివాహాలు చేయడంతో అప్పులయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక మదనపడేవాడు. గురువారం క్రిమి సంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. అప్పుల కారణంగా తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని, తమ కుంటుంబం పెద్దదిక్కును కోల్పోయిందని తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని భార్య సోమి వాపోయింది. మృతుడు మంగ్తకు భార్య సోమితో పాటు ముగ్గురు కుమార్తెలు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడి వివాహమైనట్లు మృతుని భార్య సోమి తెలిపింది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



మాడ్గులపల్లి, జూలై 5: విద్యుదాఘాతంతో ఓ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మాడ్గులపల్లి మండలంలోని పాములపాడు గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.... పాములపాడు గ్రామానికి చెందిన కొర్రి రేణుక (38) ఉదయం ఇంటి వద్ద ఉన్న వాకిలిని ఊడ్చుతుంది. ఆ సమయంలో వారి ఇంటికి విద్యుత్ సరఫరా అయ్యే సర్వీస్ వైర్ తెగి ఆమె మీదపడడంతో విద్యుదాఘాతానికి గురైంది. దీంతో వెంటనే గమనించిన స్థానికులు సూర్యాపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రేణుక మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాన్ని మిర్యాలగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. మృతురాలి భర్త రాజు ఏడాది క్రితం అనారోగ్యంతో మృతిచెందగా రేణుక అకస్మాత్తుగా విద్యుదాఘాతానికి గురవడంతో ఇద్దరు పిల్లలు అనాధలుగా మారారు. తల్లిదండ్రులు కోల్పోవడంతో పిల్లలు కన్నీరుమున్నీరుగా రోధించారు. మృతురాలి తండ్రి నంద్యాల జానయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ప్రమాదవశాత్తు వాగులో పడి వృద్ధుడు..



అనంతగిరి, జూలై 5: ప్రమాదవశాత్తు వాగులో పడి ఓ వృద్ధుడు మృతి చెందాడు. ఈ సంఘటన సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలంలోని పాలారంతండాలో శుక్రవారం జరిగింది. అనంతగిరి ఎస్‌ఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన ధరావత్ రాములు (75) పశువులకు నీరు తాపడానికి వాగు వద్దకు తీసుకువెళ్లాడు. ఈ క్రమం లో కాలు జారి వాగులో పడిపోయాడు. సాయంత్రమైనా పశువులు, రాములు ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆచూకీ కోసం గాలించారు. వాగులో రాములు మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రాములు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ఆసుపత్రికి తరలించారు. మృతుడు రాములుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

మొక్కల సంరక్షణ అభినందనీయం

నార్కట్‌పల్లి, జూలై 5: నార్కట్‌పల్లి మండలంలోని బీ వెల్లెంల ఉదయసముద్రం ప్రాజెక్టు రిజర్వాయర్ వద్ద ఏర్పాటు చేసిన బృహత్ పల్లె ప్రకృతి వనాన్ని (బీపీపీవీ) జలశక్తి అభియాన్ కేంద్ర బృందం శుక్రవారం సందర్శించింది. జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్రతో కలిసి సందర్శించిన బృందం సభ్యులు వేద వీఆర్ ఆర్య, మెహంతీశ్రీ డిబాషిశ్ మెహంతీ బీపీపీవీలో పెరిగిన చెట్లతో పరుచుకున్న పచ్చదనంతో ఆహ్లాదాన్ని ఆస్వాదించారు. మొత్తం వివిధ రకాలైన 16 వేల మొక్కలను నాటగా 100 శాతం బతికించామని చెప్పడంతో వాటిని సంరక్షించిన తీరుపై అధికారులకు కితాబునిచ్చారు. ఈ బృందం వెంట డీఆర్‌డీఏ పీడీ నాగిరెడ్డి, అదనపు పీడీ నవీన్, క్లస్టర్ ఏపీడీ నర్సింగ్‌రావు, ఎంపీడీవో ఉమేష్‌చారి, ఏపీవో యాదయ్య, ఈసీ దార రాంబాబు, రామస్వామి, పంచాయతీ కార్యదర్శి టీఏలు శ్రీనయ్య, కృష్ణవేణి, అశోక్ తదితరులు ఉన్నారు.

సాగర్‌ను సందర్శించిన 'శ్రీలంక' ప్రతినిధులు

నాగార్జునసాగర్, జూలై 5: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ అంశాలపై 15 రోజుల మీడియా శిక్షణలో భాగంగా శ్రీలంక దేశానికి చెందిన 30 మంది మీడియా ప్రతినిధుల బృందం శుక్రవారం నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌ను సందర్శించారు. మధ్యాహ్నం సాగర్ విజయవిహార్‌కు చేరుకున్న వారికి మిర్యాలగూడ ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా సమాచార సహాయ సంచాలకుడు వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు. హైదరాబాద్‌లో డాక్టర్ మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలో 15 రోజుల శిక్షణలో భాగంగా ఈ బృందం రాష్ట్రంలో పలు ప్రాంతాల్లో పర్యటించనుంది. ఇందులో భాగంగా హైదరాబాద్, వరంగల్, జహీరాబాద్ తదితర ప్రాంతాలను సందర్శించారు. నాగార్జునసాగర్ సందర్శనకు వచ్చిన ఈ బృందం సాగర్ ప్రధాన డ్యాం, బుద్ధవనం, నాగార్జునకొండ తదితర ప్రాంతాలను తిలకించారు. సాగర్ విశేషాలను పర్యాటక శాఖ గైడ్ సత్యనారాయణ, సాగర్ డ్యాం విశేషాలను ఏఈ సత్యనారాయణ డీటీ శరత్‌చంద్ర, ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డి వారికి వివరించారు. శ్రీలంక బృందంలో సీఎం సలహాదారుడు సంగీశ్వరసేనధీరతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, పాత్రికేయులతో పాటు మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రం డైరెక్టర్ జనరల్ డాక్టర్ శశాంక్ గోయల్, కో డైరెక్టర్ మాధవి, ఫ్యాకల్టీ సురేష్‌కుమార్ తదితరులు ఉన్నారు.



రోడ్డు ప్రమాదాల్లో నలుగురి మృతి

● ఆరుగురికి గాయాలు

నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. ఒక్క సూర్యాపేట జిల్లాలోనే ముగ్గురు మృతి చెందారు.

ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టిన మినీ వ్యాను: ఒకరి మృతి

త్రిపురారం, కోదాడ రూరల్, చివ్వెంల, గరిడేపల్లి, హుజూర్‌నగర్, జూలై 5: ద్విచక్ర వాహనాన్ని మినీ వ్యాను ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందగా, ముగ్గురు గాయపడ్డారు. నల్లగొండ జిల్లా త్రిపురారం మండలం సత్యనారాయణపురం గ్రామం శివారులో శుక్రవారం ఉదయం ప్రమాదం జరిగింది. ఎస్‌ఐ వీరశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం.. అంజనపల్లి గ్రామానికి చెందిన మునగ మట్టయ్య(40), భార్య నాగలక్ష్మి, చిన్న కుమార్తె వర్షిణితో కలిసి ద్విచక్రవాహనంపై త్రిపురారం గ్రామానికి వస్తున్నారు. అదేసయంలో త్రిపురారం నుంచి నీలాయగూడెం వైపు వెళ్తున్న టాటాఏస్ వాహనం డ్రైవర్ నవీన్‌రెడ్డి అజాగ్రత్తగా, అతివేగంగా నడుపుతూ ఎదురుగా వస్తున్న మట్టయ్య ద్విచక్రవాహనాన్ని సత్యనారాయణపురం గ్రామ శివారులో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో టాటా ఏస్ వాహనం పల్టీ కొట్టింది. మట్టయ్య, భార్య నాగలక్ష్మి, కుమార్తె వర్షిణి తీవ్రంగా గాయపడ్డారు. టాటా ఏస్ డ్రైవర్ నవీన్‌రెడ్డి కూడా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను అంబులెన్స్‌లో మిర్యాలగూడలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మట్టయ్య మృతి చెందాడు. మట్టయ్య అన్నయ్య నాగయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కూమార్తెలు ఉన్నారు.

లారీని ఢీకొన్న బైక్: అన్నయ్య దుర్మరణం, చెల్లెలికి గాయాలు

ఆగి ఉన్న లారీని బైక్ ఢీకొట్టిన ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలోని యర్రవరం గ్రామం స్టేజీ వద్ద శుక్రవారం ఉదయం ఈ ఘటన జరిగింది. కోదాడ రూరల్ ఎస్‌ఐ అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండ కేంద్రమైన మేళ్లచెర్వుకు చెందిన కందుల హరికిషోర్‌రెడ్డి తన చెల్లెలు నవీనతో బైక్‌పై మేళ్లచెర్వు నుంచి కోదాడకు వస్తుండగా, యర్రవరం స్టేజీ వద్ద ఆగి ఉన్న లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ఘటనలో హరికిషోర్‌రెడ్డి(18)తీవ్రంగా అక్కడికక్కడే మృతిచెందినట్లు తెలిపారు. చెల్లెలు నవీన గాయపడటంతో ఆమెను కోదాడలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తండ్రి వెంకట్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



మట్టయ్య(ఫైల్)



సోమయ్య(ఫైల్)



నాగయ్య (ఫైల్)

రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన రిటైర్డు ఉద్యోగి

● రోడ్డు ప్రమాదంలో రిటైర్డు మునిసిపల్ ఉద్యోగి మృతి చెందాడు ఈ ఘటన సూర్యాపేట జిల్లా కేంద్రం దురాజ్‌పల్లిలోని జాతీయ రహదారి 65పై శుక్రవారం ఉదయం జరిగింది. ఎస్‌ఐ బి.వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా కేంద్రం జాకిర్‌హుస్సేన్‌నగర్‌కు చెందిన మునిసిపల్ ఉద్యోగి బొడ్డు సోమయ్య(60)సూర్యాపేట నుంచి చివ్వెంల మండలంలోని ఉండ్రుగొండ గ్రామంలోని ఓ దేవాలయానికి బయలుదేరాడు. మార్గమధ్యలో దురాజ్‌పల్లి వద్ద పూలు, పండ్లు కొనుగోలు చేసి రోడ్డు దాటుతుండగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు అతివేగంగా వెళ్తున్న కారు సోమయ్యను ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్రమైన గాయాలైన సోమయ్యను 108 అంబులెన్సులో కుటుంబ సభ్యులు సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సలహా మేరకు మెరుగైన చికిత్స కోసం ఖమ్మానికి తరలిస్తుండగా మార్గమధ్యలో సోమయ్య మృతి చెందాడు. సోమయ్యకు భార్య విజయలక్ష్మి, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. సోమయ్య భార్య విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణంలోని ఎన్నెస్పీ క్యాంపుకు చెందిన ఎండీ సలీం వెల్డింగ్ వర్కర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై వెళుతుండగా, మునిసిపల్ కార్యాలయం ఎదుట ఎదురుగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సలీంకు తీవ్ర గాయాలయ్యాయి. సలీంను కుటుంబ సభ్యులను ఏరియా ఆసుపత్రిలో ప్రథమ చికిత్స చేయించి, అనంతరం మెరుగైన వైద్యం కోసం సూర్యాపేట ఆసుపత్రికి తరలించారు.

ట్రాక్టర్ పల్టీ: డ్రైవర్ దుర్మరణం

● కాల్వ కట్టపై ట్రాక్టర్ పల్టీ కొట్టటడంతో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందాడు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలోని ఎల్బీనగర్‌లో శుక్రవారం జరిగింది. గరిడేపల్లి ఎస్‌ఐ ఈట సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలం ఎల్బీనగర్ గ్రామానికి చెందిన రెడపంగు నాగయ్య(42) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం గ్రామానికి చెందిన రైతు పొలం దుక్కి దున్ని పదో నెంబర్ కాల్వకట్టపై వస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాక్టర్ పల్టీ కొట్టి కాల్వలోకి పడింది. ఈ ప్రమాదంలో నాగయ్యకు తలకు తీవ్రగాయాలు అయ్యాయి. ఆయన వెంటనే స్థానికులు హుజూర్‌నగర్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సూర్యాపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడాని భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నాగయ్యకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు

'టీ-యాప్ ఫోలియో'తో 17 రకాల రవాణా సేవలు



నల్లగొండ, జూలై 5 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వినియోగదారులకు నాణ్యమైన సేవలందించాలనే ప్రభుత్వ సంకల్పానికి అనుగుణంగా రవాణాశాఖ ఆన్‌లైన్ సేవలను విస్తృతం చేస్తోంది. కీలక విభాగాల్లో వినియోగదారులు ఆన్‌లైన్ ద్వారా సేవలను వినియోగించుకోవాలని సూచిస్తోంది. సమయం ఆదా కావడం తోపాటు,డబ్బు దుర్వినియోగం కాకుండా ఈసేవలు ఉపయోగపడతాయని, మధ్యదళారీ వ్యవస్థను నిరోధించాలనే లక్ష్యంతో ప్రభుత్వం రవాణాశాఖలో ఆన్‌లైన్ సేవలను పెంచుకుంటూ వెళుతోంది. స్లాట్ బుకింగ్‌తో పాటు మరో 17 రకాల సేవలు పూర్తిస్థాయిలో ఆన్‌లైన్‌ద్వారా అందుబాటులో ఉంటాయని, వినియోగదారులు రవాణా కార్యాలయానికి రాకుండానే ఈ17రకాల సేవలను రూపొందించిన యాప్‌ద్వారా వినియోగించుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు.

రవాణాశాఖ వెబ్‌సైట్ ద్వారా నేరుగా స్లాట్ బుకింగ్

రవాణాశాఖలో ఏ పనికోసమైనా వినియోగదారులు నేరుగా రవాణాశాఖ వెబ్‌సైట్ ద్వారా స్లాట్ బుక్‌చేసుకోవాలని సూచిస్తున్నారు. వినియోగదారులు వారి మొబైల్ ద్వారా స్వయంగా గానీ, కంప్యూటర్ ద్వారా గానీ, మీసేవ, ఈ-సేవల ద్వారా గానీ బుక్ చేసి, తగిన ఫీజు చెల్లించాలి. అనంతరం రవాణాశాఖ కార్యాలయాల్లో సంబంధిత ఉద్యోగులను కలిసి అవసరమైన పత్రాలను చూపించి తమ పనిచేయించుకోవాలని, మధ్యవర్తులను ఆశ్రయించవద్దని సూచిస్తున్నారు.

ఆన్‌లైన్ సేవల కోసం 'టీ-యాప్ ఫోలియో' యాప్

వినియోగదారుల సౌకర్యార్థం రవాణాశాఖ 17 రకాల సేవలను పూర్తిస్థాయిలో ఆన్‌లైన్ ద్వారానే అందించాలని నిర్ణయించింది. ఇందుకోసం ప్రత్యేకంగా 'టీ-యాప్ ఫోలియో' యాప్‌ని రూపొందించింది. వినియోగదారులు రవాణాశాఖ కార్యాలయానికి రాకుండానే మొబైల్ ఫోన్లలో ఈయాప్‌ని డౌన్‌లోడ్ చేసుకుని, తద్వారా ఈయాప్ నుంచి లావాదేవీలు నిర్వహించవచ్చని రవాణాశాఖ పేర్కొంటోంది. ఈయాప్‌ని ప్లేస్టోర్ ద్వారా ఆండ్రాయిడ్ ఫోన్‌లో, యాప్‌స్టోర్ ఐఓఎస్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచిస్తోంది. ఆన్‌లైన్ ద్వారా ప్రత్యేక యాప్ నుంచి 17రకాల సేవలకు అప్లయి చేసుకుంటే పని పూర్తయ్యాక సంబంధిత పత్రాలు (డ్రైవింగ్ లైసెన్స్‌లు, రిజిస్ట్రేషన్ కార్డులు, ఇతరత్రా) నేరుగా పోస్టు ద్వారా వినియోగదారులకు అందిస్తామని రవాణాశాఖ పేర్కొంటోంది.

ఆన్‌లైన్‌లో 17 సేవలు ఇవే..

1. డూప్లికేట్ లెర్నర్ లైసెన్స్ జారీ, 2. డూప్లికేట్ లైసెన్స్ జారీ, 3, బ్యాడ్జీ జారీ, 4. ప్రస్తుత డ్రైవింగ్‌లైసెన్స్ సరెండర్ చేసి స్మార్ట్‌కార్డ్ పొందుట, 5, లైసెన్స్ చరిత్ర పత్రం జారీ, 6. డ్రైవింగ్ లైసెన్స్ రెన్యువల్, 7. డ్రైవింగ్ లైసెన్స్ చిరునామా మార్పు, 8. హపర్‌డస్ (ప్రమాదకర) వాహన లైసెన్స్ ఆమోదం పొందుట, 9. కాలపరిమితి ముగిసిన లెర్నర్ లైసెన్స్ ఆమోదం పొందుట, 10. అదనపు వాహనక్లాస్ లైసెన్స్ లెర్నింగ్ లైసెన్స్ పొందుట, 11. గడువుముగిసిన డ్రైవింగ్ లైసెన్స్ స్థానంలో లెర్నింగ్ లైసెన్స్ జారీ, 12. రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌లో చిరునామా మార్పు, 13. తెలంగాణ పరిధిలో క్లియరెన్స్ సర్టిఫికెట్ జారీ, 14. కొత్తపర్మిట్ జారీ, 15. డూప్లికేట్ పర్మిట్ జారీ, 16.పర్మిట్ పునరుద్ధరణ, 17. తాత్కాలిక/ స్పెషల్ పర్మిట్ జారీ.

ఆన్‌లైన్ సేవలను వినియోగించుకోవాలి



వినియోగదారులకు నాణ్యమైన సేవలందించే క్రమంలో 17 రకాల సేవలను ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్నాం. ఇందుకోసం ప్రత్యేకంగా రూపొందించిన 'టీ-యాప్ ఫోలియో' వినియోగదారులు తమ స్మార్ట్ ఫోన్ ద్వారానే ఈసేవలను పొందవచ్చు. పని పూర్తయ్యాక వారికి సంబంధిత పత్రాలను కూడా మేమే స్వయంగా పోస్టాఫీసు ద్వారా నేరుగా ఇంటికి పంపిస్తాం. మధ్యవర్తులను, దళారీలను ఎట్టి పరిస్థితుల్లో ఆశ్రయించవద్దు. పైన పేర్కొన్న సేవలే కాక ఇతర ఎలాంటి సేవలైనా నేరుగా రవాణాశాఖ కార్యాలయాలకు వచ్చి, ఉద్యోగులను సంప్రదించి సేవలు పొందాలని సూచిస్తున్నాం.

- జి.సురేష్‌రెడ్డి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్, నల్లగొండ.



పంటల మద్దతు ధరకు చట్టం చేయాలి


నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు

నల్లగొండ టౌన్, జూలై 5: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు గ్యారెంటీ చట్టాన్ని చేయాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర నాయకుడు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. కేంద్ర కమిటీ పిలుపుమేరకు శుక్రవారం రైతు సంఘం ఆధ్వర్యంలో స్థానిక సుభాష్ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో అనేక రైతు వ్యతిరేక చట్టాలు తీసుకొచ్చిందని, వ్యవసాయాన్ని సంక్షోభంలోకి నెట్టే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు ఢిల్లీలో చేసిన రైతు ఉద్యమాన్ని మోదీ దిగివచ్చి చట్టాలను రద్దు చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. ఆ చట్టాలను పూర్తిగా రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని, మృతి చెందిన రైతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బండ శ్రీశైలం, కుంభం కృష్ణారెడ్డి, నన్నూరి వెంకటరమణారెడ్డి, ఎండీ. సలీం, వి.నారాయణరెడ్డి, రాములు, బుచ్చిరెడ్డి, అశోక్‌రెడ్డి, మల్లం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల జీతాలు చెల్లించే వరకు సమ్మె


చండూరులో సమ్మెకు మద్దతిచ్చి మాట్లాడుతున్న వీరారెడ్డి

చండూరు, జూలై 5: మునిసిపల్ కార్మికులకు జీతాలు చెల్లించే వరకు సమ్మె విరమించేది లేదని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుమ్మల వీరారెడ్డి అన్నారు. మునిసిపల్ కార్మికులు చండూరులో చేపట్టిన సమ్మె శుక్రవారం ఐదవ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఆయన సమ్మెకు మద్దతు తెలిపి మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పెంచిన జీతాలు అమలు చేయకపోవడం వల్ల కార్మికులు తీవ్రంగా నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చండూరులో నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబాలు పస్తులు ఉండే పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య, నాయకులు నాంపల్లి చంద్రమౌళి, బొట్టు శివకుమార్, మొగుదాల వెంకటేశం, చిట్టిమల్ల లింగయ్య, ధనంజయ, కార్మికులు అన్నెపర్తి వెంకన్న, నల్లగంటి లింగస్వామి, సైదులు, నాగరాజు, కళమ్మ, అలివేలు, చంద్రమ్మ, ఎల్లమ్మ, రమణమ్మ, జంగమ్మ, ముత్తమ్మ, రజిత పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి


సమ్మె నోటీసు అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

దేవరకొండ, జూలై 5: ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీవో 60 ప్రకారం నెలకు రూ. 15600 కనీస వేతనం ఇవ్వాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు నూనె రామస్వామి డిమాండ్ చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులతో కలిసి ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాములునాయక్‌కు సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. జీవో 60 ప్రకారం వేతనాలు ఇవ్వాలని, అవుట్ సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ డివిజన్ కార్యదర్శి జూలూరి వెంకట్రాములు, రామేశ్వరమ్మ, రోజరాణి, భద్రమ్మ, నారమ్మ, అలివేలు, జానకి పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


సమావేశంలో మాట్లాడుతున్న అప్పారావు

దేవరకొండ, జూలై 5: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై ఎంప్లాయిస్ యూనియన్ ఉద్యోగుల పక్షాన నిరంతరం పోరాటాలు నిర్వహిస్తుందని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అప్పారావు అన్నారు. దేవరకొండ సీపీఐ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్తులో కార్మికుల సమస్య పరిష్కారమే ఏజెండాగా ఎంప్లాయిస్ యూనియన్ పనిచేస్తుందన్నారు. ఉద్యోగుల పనిభారం తగ్గించాలని, న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం దేవరకొండ డిపో ఎంప్లాయిస్ యూనియన్ నూతన అధ్యక్షుడుగా డి.యాదయ్య, కార్యదర్శిగా బి.యాదయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఏవిరెడ్డి, సహాయకార్యదర్శిగా లక్ష్మయ్యలను ఎన్నుకున్నట్లు ప్రకటించారు. సమావేశంలో ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి కె.ఎస్.రెడ్డి, జిల్లా కార్యదర్శి వెంకటయ్య, సలహాదారుడు షైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు హాశం

నల్లగొండటౌన్, జూలై 5: వర్షాకాలం నేపథ్యంలో వచ్చే సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సయ్యద్ హాశం, పట్టణ కార్యదర్శి ఎండి సలీం డిమాండ్ చేశారు. సుందరయ్య భవన్‌లో శుక్రవారం నిర్వహించిన పట్టణ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలో పారిశుధ్యం నిర్వహణ సరిగ్గా లేక దోమలు పెరుగుతున్నాయని, తద్వారా ప్రజలు మలేరియా, డెంగ్యూ, విషజ్వరాల బారినపడే ప్రమాదం ఉందని అన్నారు. ప్రజారోగ్యశాఖ, మునిసిపల్ అధికారులు సమన్వయంతో రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చాలని, పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. వార్డుల వారీగా ప్రజావాణి చేపట్టి దరఖాస్తులు స్వీకరించడం అభినందనీయమని అన్నారు. ఆ సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఎన్నికల హామీలను ప్రభుత్వం అమలు చేయని యెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దండెంపల్లి సత్తయ్య, తుమ్మల పద్మ, పట్టణ కార్యదర్శివర్గ సభ్యులు కుంభం కృష్ణారెడ్డి, అద్దంకి నరసింహ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలి


విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న క్లబ్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్, జూలై 5: ప్రతిభ గల విద్యార్థులను ప్రోత్సహించాలని వాసవీ, వనిత క్లబ్ పెద్దలు రాచర్ల కమలాకర్, పబ్బతి వేణుమాధవ్ అన్నారు. క్లబ్ విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. తాళ్లగడ్డ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్లబ్ డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి రాయపుడి భవాని పాఠశాలను దత్తత తీసుకోవడం ఆదర్శనీయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో భాగంగా మొక్కలు నాటిన క్లబ్ సభ్యులు దంత వైద్యులతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. పేదలకు బియ్యం, దుస్తులు, కుర్చీలు, మహిళలకు కుట్టు మిషన్లు, వీధి వ్యాపారులకు గొడుగులు అందజేశారు. కార్యక్రమాల్లో క్లబ్ సభ్యులు కలకోట లక్ష్మయ్య, బిక్కుమల్ల కృష్ణ, తిరునగరు పద్మ, కొప్పురావూరి రమాదేవి, గంధం లీలారాణి, భోనగిరి లావణ్య, పైడిమర్రి ఉష, జయిని సుస్మిత, శ్రీదేవి, నీలిమ, పద్మావతి, పద్మసాయి, సంధ్య పాల్గొన్నారు.

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి

● *బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి*


కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో మాట్లాడుతున్న నాగం వర్షిత్‌రెడ్డి

నల్లగొండ టౌన్, జూలై 5: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 8 నెలలు కావస్తున్నా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించకుండా, జాబ్ క్యాలెండర్ విడుదల చేయకుండా నిమ్మకు నీరెత్తినట్టుగా వ్యవహరిస్తుందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు గోలి మధుసూదన్‌రెడ్డి అన్నారు. నిరుద్యోగులపై ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ శుక్రవారం బీజేపీ యువమోర్చా ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన మహా ధర్నాలో వారు పాల్గొని మాట్లాడారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని లేనిచో బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అధికారంలోకి వచ్చే వరకు అమలు చేయలేని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక నిరుద్యోగుల జీవితాలతో చెలగాటాలు ఆడుతున్నారని అన్నారు. ఈ విషయంలో అధికార కాంగ్రెస్ పార్టీ తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు వంగూరు రాఖీ మాట్లాడుతూ తెలంగాణ నిరుద్యోగ సమస్యలపై 100 రోజులుగా ప్రభుత్వంపై ఉద్యమం చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి జిల్లా నిరుద్యోగులకు న్యాయం చేయకుంటే పుట్టగతులు లేకుండా చేస్తామని హెచ్చరించారు. వినతిపత్రం అధికారులకు ఇచ్చేందుకు వెళ్లే క్రమంలో ఒక్కసారిగా కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకొని వారిని బలవంతంగా స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు దుబ్బాక సాయి, లోహిత్‌రెడ్డి, రేవెల్లి కిరణ్, చిగుర్ల లింగరాజు, గోపి, బొడిగ భరత్, శ్రీకాంత్, ముంత సైదులు, బొమ్మిడి శ్రీకాంత్, మారగోని సురేష్, నాగరాజు, భరత్, దుర్గా, రవీందర్ యాదవ్, శాంతి స్వరూప్, ఉంగరాల ప్రశాంత్, కడియం సైదులు, శివ, గోపి, మల్లెపల్లి భరత్, సోమశంకర్, విష్ణు, స్వామి, నరేష్, తోటి శివ, బిల్లా నాయక్, శివరుద్ర పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లేందుకు వెళ్తున్న నాయకులను అడ్డుకొని అరెస్ట్ చేస్తున్న పోలీసులు

దేవరకొండ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడిగా కరుణాకర్

దేవరకొండ, జూలై 5: దేవరకొండ ప్రెస్‌క్లబ్ నూతన కమిటీని శుక్రవారం ఎన్నుకున్నట్లు ప్రెస్‌క్లబ్ గౌరవ అధ్యక్షుడు గాదె గిరిధర్‌రావు తెలిపారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా వైఎస్ కరుణాకర్, ప్రధానకార్యదర్శి పలుపులేటి శివప్రసాద్, కోశాధికారి శ్రీపతిరావు, ఉపాధ్యక్షులు జూలూరి వెంకటయ్యగౌడ్, ముదిగొండ రాందాస్, సింగం నారాయణ, కార్యదర్శి దర్శనం విష్ణు, ప్రచారకార్యదర్శిగా అంజన్‌తో పాటు మరో 14 మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నట్లు ఆయన ప్రకటించారు.

ఏటీసీలో ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ

డిండి, జూలై 5: డిండి మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ భయ్యా మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కోపా, డ్రాఫ్ట్స్‌మెన్ సివిల్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, స్టెనోగ్రఫీ, వెల్డర్, ట్రేడ్‌లలో రెండో విడత సీట్ల భర్తీ కోసం ఈ నెల 15వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 8వ తరగతి ఉత్తీర్ణులై 14 సంవత్సరాల వయస్సు పైబడినవారు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి మార్కులు జాబితా, 4వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకున్న బోనఫైడ్, ఈ మెయిల్, ఫొటోతో ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడాలి


మర్రిగూడ: వట్టిపల్లి కాలనీలో అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

మర్రిగూడ, శాలిగౌరారం, నల్లగొండటౌన్, జూలై 5: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మర్రిగూడ, శాలిగౌరారం ఆరోగ్య వైద్యాధికారులు డాక్టర్ దీపక్, డాక్టర్ సూర్య శిల్ప అన్నారు. శుక్రవారం జిల్లాలోని మర్రిగూడ, శాలిగౌరారం మండలాల్లో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ నీటిని నిల్వ ఉంచడం వల్ల ఈగలు, దోమలు చేరి వృద్ధి చెందుతాయని అన్నారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ పరిసర ప్రాంతాలను పరిశీలించి తొట్లలో ఉన్న నీటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. పారిశుధ్య నిర్మూలన కోసం ప్రతీ ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

● మర్రిగూడ మండలంలోని వట్టిపల్లి కాలనీలో సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. గతేడాది వట్టిపల్లి కాలనీలో డెంగ్యూతో వ్యక్తి తీవ్ర అస్వస్థతకు గురైనందున మరల పునరావృత్తం కాకుండా ప్రజలను చైతన్యవంతం చేశారు. కాలనీలో ఇంటింటికీ తిరుగుతూ పరిసర ప్రాంతాలను పరిశీలించి తొట్లలో ఉన్న నీటిని తొలగించే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో ప్రసాద్, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

● ప్రస్తుతం వానాకాలం సీజన్‌లో డెంగ్యూ, మలేరియా వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని శాలిగౌరారం మండల వైద్యాధికారి డాక్టర్ సూర్య శిల్ప అన్నారు. పలు వార్డుల్లో ఆమె సందర్శించారు. ప్రతీ ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటిని, ఇళ్ల పరిసరాలను గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. జీపీ సిబ్బంది ఎప్పటికప్పుడు డ్రైనేజీలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని కోరారు. కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మావతి, మయూరి, ఆశావర్కర్ గుణపతి పాల్గొన్నారు.

పదేళ్లలో వెయ్యి కోట్ల అభివృద్ధి : భాస్కర్‌రావు


పదవీవిరమణ చేసిన నాయకులతో ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, జూలై 5: నియోజకవర్గంలో పదేళ్లలో వెయ్యి కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యుల పదవీ విరమణ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అందరి సహకారంతో రూ.856 కోట్లతో 6 ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయించినట్లు తెలిపారు. తండాలను జీపీలుగా మార్చడం, అభివృద్ధి చేయడంతో పాటు కనెక్టివిటీ రోడ్లు, విద్య, వైద్యాభివృద్ధికి ఎంతో కృషి చేసినట్లు పేర్కొన్నారు. పదవీకాలం పూర్తయిందని విశ్రాంతి తీసుకోవద్దని, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని దిశానిర్దేశం చేశారు. రాజకీయాల్లో గెలుపోటములు సాధారణమేనని, రానున్న రోజుల్లో పార్టీకి పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పదవీ విరమణ చేసిన ఎంపీపీ, వైస్ ఎంపీపీ, జడ్పీటీసీ, కోఆప్షన్ సభ్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తిప్పన విజయసింహారెడ్డి, చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, నూకల సరళ, దుర్గంపూడి నారాయణరెడ్డి, చిట్టిబాబునాయక్, కుందూరు వీరకోటిరెడ్డి, మోసిన్‌అలీ, లలిత, బాలాజీనాయక్, సైదులు, సేవ్యానాయక్ తిరుపతమ్మ పాల్గొన్నారు.

రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

పెద్దవూర, జూలై 5: ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని బీజేపీ కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు జూలకంటి మట్టారెడ్డి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో తహసీల్దార్ సరోజకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ, రైతుభరోసా అందించాలని, ఆయిల్ పామ్ రైతులకు పెట్టుబడి కింద కేంద్రం విడుదల చేసిన రూ. 10,500 వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పాల్తి శంకర్‌నాయక్, ఏరుకొండ నరసింహ, చందా వెంకట్‌రెడ్డి, పలస రవి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న ప్రభుత్వం : బూర


పార్టీ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న నర్సయ్యగౌడ్

రామగిరి, జూలై 5 : గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగానే కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజలను మోసం చేస్తుందని మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొంగిడి మనోహర్‌రెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం డిండి ప్రాజెక్టు పేరిట ప్రజలను మోసం చేస్తే ఇప్పుడు కాంగ్రెస్ ఎస్ఎల్‌బీసీ పేరుతో మోసం చేస్తుందని ఆరోపించారు. జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా కృష్ణాజలాల వాటాలను తేవడంలో విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేసేందుకు ఆర్థిక వనరులు సమకూర్చుకునే పనిలో ఉందే తప్ప ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయాలనే సోయి లేకుండా పోయిందని విమర్శించారు. పార్లమెంట్‌లో ప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీ పార్లమెంట్‌లో చేసిన వ్యాఖ్యలు హిందూ సమాజాన్ని కించపరిచేలా ఉన్నాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆరు పథకాలన్నీ గంగలో కలిశాయని, ఆయన సొంత నిర్ణయాలు తీసుకోలేక దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నాడని ఎద్దేవా చేశారు. ఎన్నికల హామీలను అమలుచేయకపోతే బీజేపీ ప్రజల పక్షాన పోరాడుతుందన్నారు. అనంతరం కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. సమావేశంలో పార్లమెంట్ ప్రభారి చింతల రామచంద్రరెడ్డి, నాయకులు పాపరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, మాదగాని శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పలుపు తాడునే ఉరి తాడుగా మార్చి...

● *ఊపిరాడకుండా చేసి ఎద్దును చంపిన గుర్తు తెలియని వ్యక్తులు*


దుండగులు చంపిన ఎద్దును పరిశీలిస్తున్న పోలీసులు

నార్కట్‌పల్లి, జూలై 5: పలుపుతాడునే ఉరి తాడుగా మార్చి ఊపిరి ఆడకుండా చేసి గుర్తు తెలియని వ్యక్తులు ఓ ఎద్దును చంపేశారు. వారిని ఏం చేసిందో తెలియదు కాని నోరు లేని జీవాన్ని మట్టుపెట్టారు. ఎద్దు మీద కోపమా... రైతు మీద కక్షో తెలియదు కాని మూగ జీవాన్ని బలి తీసుకున్నారు. శుక్రవారం నార్కట్‌పల్లి మండల పరిధిలోని ఎల్లారెడ్డిగూడెంలో ఈ సంఘటన జరిగింది. నార్కట్‌పల్లి మండలం ఎనుగులదొరి గ్రామానికి చెందిన మహేశ్వరం సుధాకర్ ఎల్లారెడ్డిగూడెం పరిధిలో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. తాను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్న బావి వద్ద గురువారం రాత్రి పనులు ముగించుకుని ఎద్దును కొట్టంలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం బావి వద్దకు వెళ్లి చూడగానే ఎద్దును కట్టేసిన చెట్టుకే పలుపుతాడుతో మెడకు ఊపిరాడకుండా చేసి అటూ ఇటూ కదలకుండా తోకను కూడా చెట్టుకు కట్టేసి క్రూరంగా చంపేసినట్లు గుర్తించాడు. చనిపోయిన ఎద్దు విలువ సుమారు రూ.50వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ఈ ఎద్దును ఐదు రోజుల క్రితమే చౌడంపల్లిలో ఓ రైతు వద్ద కొనుగోలు చేసినట్లు బాధితుడు తెలిపారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు సుధాకర్ తెలిపాడు. సంఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

బీజేవైఎం నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు


పెద్దవూరలో బీజేవైఎం నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించిన పోలీసులు

తిరుమలగిరి(సాగర్), కొండమల్లేపల్లి, పెద్దవూర, జూలై 5: నీట్ పరీక్ష, ఉద్యోగాల భర్తీకి సంబంధించి విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. శుక్రవారం అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో ఆందోళన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల సమస్యలపై పోరాడుతున్న ఏబీవీపీ నాయకులను, కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ అన్యాయమని అన్నారు. గత ప్రస్తుతం మాదిరిగాప రేవంత్‌రెడ్డి ప్రభుత్వం కూడా నిరుద్యోగుల సమస్యలపై పోరాడేవారిపై అన్యాయంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 45 రోజుల క్రితం టెట్, హాస్టల్ వార్డెన్ పరీక్షలు నిర్వహించారని, కనీస సమయాన్ని ఇవ్వకుండా పలు పరీక్షలను నిర్వహించడానికి ప్రభుత్వం నిర్ణయించడం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా డీఎస్సీ, గ్రూప్స్ పోస్టులను పెంచడంతో పాటు ఆ పరీక్షలకు సన్నద్ధమయ్యేందుకు నిరుద్యోగులకు తగిన సమయాన్ని ఇచ్చి పరీక్షలను నిర్వహించాలన్నారు.

● తిరుమలగిరి (సాగర్) మండలానికి చెందిన బీజేవైఎం నాయకులను శుక్రవారం ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో బీజేవైఎం రాష్ట్ర నాయకుడు మెండె అనిల్‌కుమార్ మాట్లాడుతూ ప్రజా, విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే వారిని బంధించడం సరైంది కాదన్నారు. ఆయన వెంట నాయకులు అంగోతు రాము, లక్ష్మణ్ ఉన్నారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలో పలువురు విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మణ్ నాయక్, ఏబీవీపీ నాయకుడు కొత్త అఖిల్, బీఆర్ఎస్‌వీ నాయకుడు కోటేష్‌నాయక్, తులసిరాంనాయక్, రమేష్ పాల్గొన్నారు. విద్యార్థులను అరెస్ట్ చేయడం సరైన విధానం కాదని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎలమాల గోపిచంద్ అన్నారు.

● పెద్దవూర మండల కేంద్రంలో బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో పాల్తిశంకర్‌నాయక్, ఏరుకొండ నర్సింహ, చందా వెంకట్‌రెడ్డి, పలస రవి, వెంకటయ్య పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో వానరం మృతి

● *అంత్యక్రియలు నిర్వహించిన నేరడ గ్రామస్థులు*

చిట్యాలరూరల్, జూలై 5: విద్యుదాఘాతంతో వానరం మృతి చెందగా గ్రామస్థులు అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటన చిట్యాల మండలం నేరడ గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. నేరడ గ్రామపంచాయతీ కార్యాలయం సమీపంలోని కాలనీలో విద్యుత్ స్తంభంపైకి ఎక్కిన వానరం మరో ప్రాంతానికి దూకేందుకు యత్నిస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. పారిశుధ్య సిబ్బందితో కలిసి స్థానికులు ట్రాక్టర్‌లో వానరానికి శవయాత్ర నిర్వహించిన శ్మశానవాటికలో ఖననం చేశారు.

సంక్షిప్త సమాచారం...

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామానికి చెందిన యువ వర్ధమాన క్రికెట్ క్రీడాకారులకు అదే గ్రామానికి చెందిన యువకులు సూర అంజి, మేడి శ్రీనివాస్, రవి క్రికెట్ కిట్లను బహూకరించారు. పాతబస్తీ, హనుమాన్ జంక్షన్ పేరిట రెండు టీంలకు చెందిన 30 మంది క్రీడాకారులకు క్రికెట్ కిట్లు, జెర్సీలను అందజేశారు.

మర్రిగూడ: మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్‌లో ఆరవ తరగతి చదువుతున్న విద్యార్థులకు మండల కేంద్రానికి చెందిన మాస బాలరాజు హిందీ, ఇంగ్లీష్ నోట్ పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం బుచ్చయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: మండలంలోని ఏపీలింగోటం జడ్పీ హైస్కూల్ ఆవరణలో వనమహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో క్లీన్ హోం-గ్రీన్ హోం నిర్వాహకుడు అదిమళ్ల మణిరాజ్, హెచ్ఎం కాశయ్య, టీచర్లు రమేష్, హెప్సీబా, వినోద, పద్మావతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

రామగిరి: దేవరకొండ క్లస్టర్ పరిధిలో ఇటీవల మృతి చెందిన ఖానాపూర్ గోపాలమిత్ర పల్లె వెంకటయ్య కుటుంబానికి గోపాలమిత్ర సర్వీస్ అసోసియేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎల్లెంల శంభులింగం మాట్లాడుతూ జిల్లాలోని ఉన్న 80 మంది గోపాలమిత్రల సహకారంతో రూ.60 వేలు ఆర్థిక సహాయం అందజేయడం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు యాదయ్య, నాగయ్య, యాదగిరి, సురేష్, లింగారెడ్డి, మల్లేష్, వెంకటేష్, వెంకన్న, నర్సింహ, మహేష్, సందీప్, ఉపేందర్ పాల్గొన్నారు.

దేవరకొండ: లయన్స్ క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని దేవరకొండ లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వస్కుల సత్యనారాయణ అన్నారు. మండలంలోని ముదిగొండలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్యశిబిరాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. 130 మందికి కంటి పరీక్షలు నిర్వహించి 20 మందికి కంటి శస్త్ర చికిత్సకు హైదరాబాద్‌కు పంపినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ హరి, లయన్స్‌క్లబ్ జోనల్ చైర్మన్ వనం భిక్షమయ్య, చిలుకూరి నిరంజన్, పగిడిమర్రి శ్రీనివాస్, మల్లయ్య, వనం శ్రీనివాస్ పాల్గొన్నారు.

చిట్యాల: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఈ నెల 7న నిర్వహించే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం నియోజకవర్గ ఇన్‌చార్జి మేడి శంకర్ కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎరసాని గోపాల్, పెరిక లింగస్వామి, పురుషోత్తం పాల్గొన్నారు.

మిర్యాలగూడ: కాంగ్రెస్ పార్టీ స్టార్ క్యాంపెయిన్ కమిటీ జిల్లా చైర్మన్‌గా పట్టణానికి చెందిన పోలగాని వెంకటేష్‌గౌడ్ నియమితులయ్యారు. పార్టీలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తున్న వెంకటేష్‌ను జిల్లా చైర్మన్‌గా నియమిస్తూ ప్రచార కమిటీ స్టేట్ చైర్మన్ మధుయాష్కీగౌడ్ ఉత్తర్వులు జారీ చేయగా సీనియర్ నేత జానారెడ్డి వెంకటేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో పయిడిమర్రి నర్సింహరావు, చిరుమర్రి కృష్ణయ్య, సైదులు, తమ్మడబోయిన అర్జున్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

పెద్దఅడిశర్లపల్లి: హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద ఈ నెల 7వ తేదీన టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగ చేపట్టనున్న వంగపల్లి దీక్షను విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు రమణంపల్లి వెంకటయ్యమాదిగ పిలుపునిచ్చారు. మండలంలోని అంగడిపేట ఎక్స్ రోడ్డు వద్ద శుక్రవారం సంఘం నాయకులు దీక్షకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీఎమ్మార్పీఎస్ నాయకులు ఏలేటి నర్సింహ, వట్టేపు గోవర్ధన్, అచ్యుత్‌కుమార్, మార్కు, రవి, కాశయ్య, ఎల్లయ్య, గోవర్ధన్ పాల్గొన్నారు.

మిర్యాలగూడ అర్బన్: సేవే పరమార్థంగా నాయీ పిల్లర్స్ ఫౌండేషన్(ఎన్‌పీఎఫ్) ఏర్పాటు చేసినట్లు సంఘం గౌరవ సలహాదారు, ఉపాధ్యాయ సంఘ నేత నాగవెల్లి ఉపేందర్ అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడి అదే సమయంలో కుక్క కాటుకు గురై కోమాలో ఉన్న ఎల్లయ్యకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థికకసాయం అందజేశారు.

నల్లగొండ టౌన్: ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠినచర్యలు తీసుకోవడమే కాకుండా రూ.1 లక్ష వరకు జరిమానా విధిస్తామని తహల్దార్ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ శివకుమార్ తెలిపారు. మండలంలోని నర్సింగ్‌భట్లలో సాండ్ ట్యాక్స్ పాలసీపై అవగాహన సదస్సు నిర్వహించారు.

చింతపల్లి : ఆలయ అభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానని దేవస్థాన పాలక మండలి చైర్మన్ పూరె లక్ష్మణ్ అన్నారు. వెంకటేశ్వరనగర్ (మాల్)లోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో దాతల సహకారంతో ప్రతీ అమావాస్య సందర్భంగా శుక్రవారం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేశారు. ధర్మకర్తలు మద్దెల కృష్ణగౌడ్, గడ్డం ఆంజనేయులు ఉన్నారు.

అడవిదేవులపల్లి : మండలంలోని బంగారుకుంటతండాకు చెందిన కుర్ర కృష్ణప్రసాద్ చలకుర్తి నవోదయ విద్యాలయంలో పదో తరగతి ఫలితాల్లో ప్రథమ స్థానంలో నిలిచి దక్షిణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఐఐటీ జేఈఈ అడ్వాన్స్ పరీక్షకు రెండు సంవత్సరాల ఉచిత శిక్షణకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా బెంగుళూరులోని జవహర్ నవోదయ విద్యాలయ వైస్ ప్రిన్సిపాల్ సుందర్‌కుమార్ విద్యార్థి కృష్ణప్రసాద్‌కు ప్రవేశపత్రం అందించి అభినందించారు.

కట్టంగూరు: రైతు పెట్టుబడి సాయం, రైతు భరోసా నిధులు వెంటనే విడుదల చేసి, రైతులను ఆదుకోవాలని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పాదూరి వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. తహసీల్దార్ గుగులోతు ప్రసాద్ వినతిపత్రం అందజేశారు.

చిట్యాలరూరల్ : మండలంలోని నేరడ జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతిని పూర్తి చేసిన విద్యార్థినులు బాసరలోని ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. ఇటీవల విడుదలైన 10వ తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో నేరడ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన పొట్టబత్తిని ఫణిశ్రీ 10జీపీఏ, కొన్నె హన్సిక 9.8జీపీఏను సాధించారు. ట్రిపుల్ ఐటీలో చేరేందుకు పరీక్షను రాయగా ఈనెల 4వ తేదీన విడుదలైన ఫలితాల్లో ఇద్దరు ఎంపికయ్యారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జి. రామ్మోహన్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

మునుగోడు రూరల్: మద్యం బెల్ట్ షాపులను నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని చండూరు సీఐ వెంకటయ్య పేర్కొన్నారు. మునుగోడు మండలం కొరటికల్ గ్రామంలో ప్రజలకు అవగాహన కల్పించారు.